సాక్షి తిరుపతి
బుధవారం । 26 । జూలై । 2023



కారు టైరు పేలి

కారు టైరు పేలి మరో కారును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

– 8లో



పచ్చని శిలాతోరణం!

శేషాచల కొండలు పచ్చని తివాచీ పరుచుకుని ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	28	26
చిత్తూరు	28	25
తిరుమల	23	21
గూడూరు	28	26
నగరి	29	26

న్యూస్‌రీల్

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు మరింత వేగవంతం



మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని చైర్మన్, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ 31వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అంతకుముందు స్మార్ట్ సిటీ సీఈఓ, ఎండీ డీ.హరిత తిరుపతిలో చేపట్టిన పలు ప్రాజెక్టులను వివరించారు. ఇప్పటికే రూ.181 కోట్లతో చేపట్టిన 60 పనులు పూర్తిచేసినట్టు వెల్లడించారు. మరో రూ.1,431 కోట్లతో చేపట్టిన 37 ప్రాజెక్టులు తుది దశలో ఉన్నాయన్నారు. వర్చువల్ విధానంలో టీటీడీ జేఈఓ సదాభార్గవి, ఎస్పీ పరమేశ్వర రెడ్డి, న్యూఢిల్లీ నుంచి కేంద్ర ప్రభుత్వ నామిని డైరెక్టర్ విజయకుమార్, తుడా వీసీ హరికృష్ణ, ఇండిపెండెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రమాశ్రీ, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈ మోహన్, ఎం ఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బయోకెమిస్ట్రీపై జాతీయ సదస్సు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ బయోకెమిస్ట్రీ విభాగ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన 'అడ్వాన్స్ ఇన్ బయోకెమిస్ట్రీ' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ ఓవీఎస్ రెడ్డి తెలిపారు. మంగళవారం జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆ విభాగపు డీన్, అధ్యాపకులతో కలిసి వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ ఆవిష్కరించారు. డీన్ సీహెచ్ అప్పారావు, కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్వీఎస్ మూర్తి పాల్గొన్నారు.

చదువుకుని ఉద్యోగాలు రాలేదని బాధపడుతున్నారా..? ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్నారా..? ఉద్యోగం ఒక్కటే కాదండోయ్.. మీరు రాణించాలేగానీ ఎన్నో మార్గాలున్నాయి.. సంకల్పం ఉంటే చాలు. వ్యాపారంలోనూ రాణించొచ్చు. పదిమందికీ ఉపాధి అవకాశాలు కల్పించొచ్చు. మీ ప్రాంతంలోనే చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. మీదే ఆలస్యం. ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి. మీరు కోరిన పరిశ్రమను ఏర్పాటు చేసి.. తమతోపాటు పదుగురికి ఉపాధి మార్గాలు చూపండి.



బిస్కెట్ల తయారీ పరిశ్రమ

ఆహార శుద్ధి.. వ్యాపారవృద్ధి!

- జిల్లాకు 340 ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు
- ఒక్కో యూనిట్‌కు రూ.29.75 లక్షలు
- అందులో రూ.10 లక్షల వరకు సబ్సిడీ
- 90 శాతం బ్యాంక్ రుణం
- ఇప్పటికే 144 దరఖాస్తులు

తిరుపతి అర్బన్: ఉపాధి చూపడంతోపాటు ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం సకల ప్రయత్నాలు చేస్తోంది. ఓ వైపు చదువుకున్న వారికి జాబ్ మేళా ద్వారా డీఆర్‌డీఏ నేతృత్వంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. మరోవైపు వివిధ పరిశ్రమలను ప్రోత్సహిస్తూ ఉపాధి మార్గాలు చూపుతోంది. తాజాగా చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి జీవనోపాధి పొందడానికి తిరుపతి జిల్లాకు 340 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేసింది. ఒక్కో యూనిట్‌కు రూ.29.75 లక్షలు కేటాయించి, రూ.10 లక్షల వరకు రాయితీ కల్పిస్తోంది. లబ్ధిదారులు 10 శాతం చెల్లిస్తే.. 90 శాతం బ్యాంక్ రుణం ఇప్పిస్తోంది. అందులో 35 శాతం రాయితీ లభిస్తోంది. ఈ కార్యక్రమానికి ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ తరఫున ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా చేయూతనందిస్తోంది.

నిరుద్యోగ యువతకు చేయూత

ఆహార సంబంధిత పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి, నూతన పరిశ్రమల స్థాపనకు ఈ పథకం ఎంతో దోహదపడుతుంది. ప్రధానంగా పచ్చళ్లు, అప్పడాలు, బిస్కెట్లు, పలు సుగంధ ద్రవ్యాలు, మిల్లెట్స్ సంబంధిత ఉత్పత్తులు, సూక్ష్మతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. అధునాతన పరికరాలు కొనుగోలుకు, వర్క్‌షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వం యూనిట్ కాస్ట్‌లో 90 శాతం రుణం మంజూరు చేస్తుంది. అందులో 10 శాతం లబ్ధిదారు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 35శాతం రాయితీ ఉంటుంది.

దరఖాస్తుల ఆహ్వానం

ఉద్యానశాఖ అధికారుల వద్ద దరఖాస్తులను ఈనెల 7వ తేదీ నుంచి అందుబాటులో ఉంచారు. ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తును పూర్తిచేసి ఉద్యానశాఖ అధికారులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఆ మేరకు వారు ఆన్‌లైన్ చేసిన తర్వాత సంబంధిత బ్యాంక్‌కు సమర్పిస్తారు. లబ్ధిదారులు ఆధార్‌తో పాటు పాన్‌కార్డు, పరిశ్రమల తాలూకా వివరాలు, (వాటర్ లేదా కరెంట్ లేదా గ్యాస్ బిల్లు) పరిశ్రమ స్థాపనకు అవసరమైన భూమి వివరాలు, 6 నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్ తదితర వివరాలు సమర్పించాలి. 18 ఏళ్లు నిండిన వారు అర్హులు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఈ పథకానికి 144 దరఖాస్తులు వచ్చాయి.

సద్వినియోగం చేసుకోండి



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి. మీ ప్రాంతంలోనే మీరు వ్యాపారం చేసుకోవచ్చు. ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించి ఏ చిన్న పరిశ్రమలైనా స్థాపించుకోవచ్చు. మీతో పాటు పలువురికి ఉపాధి చూపించొచ్చు.

–దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

అర్హతే ప్రామాణికం



అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నాం. జిల్లాకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా 340 యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌కు రూ.29.75 లక్షలు మంజూరు చేస్తారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోండి.

– కే.వెంకటరమణారెడ్డి,కలెక్టర్

30 ఏళ్లు టీడీపీ జెండా మోశా.. ఏం లాభం?



జగనన్న ప్రభుత్వంలో తాను పొందిన లబ్ధిని వివరిస్తున్న టీడీపీ నాయకుడు సిద్ధయ్యనాయుడు

- గతంలో ఏ లబ్ధీ పొందలేదు
- జగనన్న ప్రభుత్వంలో రూ.12 లక్షల వరకు లబ్ధి కూరింది
- పేదలకు ఇంతకన్నా ఏం కావాలి
- ఎమ్మెల్యే భూమన ఎదుట టీడీపీ నాయకుడు ఉద్ఘాటన

తిరుపతి మంగళం: '30 ఏళ్ల పాటు భుజాలు అరిగిపోయేలా టీడీపీ జెండా మోశాను. కాళ్లరిగేలా ఆ పార్టీ నాయకులతో కలిసి ప్రతి ఇల్లూ తిరిగాను. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు జూమ్ మీటింగ్‌లు పెట్టి వాయించేవారు. ప్రజలకు మేలు చేద్దాం.. అంటూ ఊదరగొట్టేవారు. ఆయన మాటలు విని ఇల్లూవాకిలి వదిలి పార్టీకోసమే పనిచేశా. కానీ ఏం లాభం. అధికారంలోకి వచ్చిన తర్వాత వారి బినామీలకు.. వారికి అనుకూలంగా ఉన్నవారికే పనులు చేశారు. నాలాంటి పేదవారిని పక్కనపెట్టారు. కానీ ఇప్పుడున్న ప్రభుత్వం అలాకాదు. కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. నిజంగా సంక్షేమ పథకాల దేవుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి. ఇలాంటి నాయకుడే రాష్ట్రానికి, ప్రజలకు అవసరం. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో టీడీపీ నాయకుడిగా నేను సుమారు రూ.12 లక్షల వరకు లబ్ధిపొందాను. పేదవాడికి ఇంతకన్నా ఏం కావాలి..? జగనన్న లాంటి నాయకుడు సీఎంగా ఉంటే ప్రతి పేదవాడి జీవితం అద్భుతంగా ఉంటుంది' అని టీడీపీ నాయకుడు సిద్ధయ్యనాయుడు తెలిపారు. మంగళవారం తిరుపతి నగరంలోని 50వ డివిజన్‌లో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధయ్యనాయుడు పై విధంగా స్పందించారు.

నేడు ఐటీఐలో జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వీ.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ జాబ్ మేళాకు అమరరాజ, హర్ష మోటార్స్, హైటెక్ మోటార్స్, డీపీ.కోకో చాకొలేట్, శ్రీసాయి హోమ్ కేర్ సర్వీసెస్, కేశ్విన్ ఆటో మోటార్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొని ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ మేళాకు 18 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగి, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, బ్యాంకు పాస్ బుక్ మొదటి పేజీ, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారానికి 94416 65290, 94928 61369 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి



సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: వర్షాలతోపాటు వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆరోగ్య జాగ్రత్తలను అందరికీ తెలియజేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు నమోదవుతున్నాయని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతోదాయన సమీక్షించారు. వీడియా కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులతో మాట్లాడారు. రోగాలపై సర్వే చేపట్టాలని, వలంటీర్లతోపాటు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్బన్ ప్రాంతాలతోపాటు పుత్తూరు మండలంలో సర్వేలో జాప్యం చోటుచేసుకుంటోందని చెప్పారు. వైద్య పరీక్షల అనంతరం సరైన వైద్యం అందించాలన్నారు. మరోవైపు ఐసీడీఎస్ కార్యాలయ అధికారులు అంగన్‌వాడీ సెంటర్లపై పర్యావేక్షణ పెంచాలని చెప్పారు. పిల్లలతోపాటు బాలింతలు, గర్భవతులకు క్రమంతప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్ కార్డులు ఉన్నవారికి పని కల్పించాలన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డీఏఓ ప్రసాద్‌రావు, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, గృహనిర్మాణశాఖ పీడీ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఇంజినీర్ శంకర్‌నారాయణ, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఎల్‌డీవోలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 73,796 మంది స్వామివారిని దర్శించుకోగా.. 28,840 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పేదల కోసమే పథకాలు

- చంద్రబాబు మోసాలను నమ్మవద్దు
- కుప్పం అభివృద్ధికి కట్టుబడి ఉంటాం
- పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి



పల్లెబాట సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పంరూరల్ : బడుగు, బలహీనవర్గాలు, రైతులు, మహిళలను దృష్టిలో ఉంచుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను రూపొందించినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం కుప్పం మండలం పల్లెబాటలో భాగంగా పలు సభల్లో ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ అమ్మ ఒడి, ఆసరా, రైతు భరోసా ఇలా ఏ పథకం తీసుకున్నా పేదల అభ్యున్నతికే ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబు చెబుతున్నట్లు అభివృద్ధి అంటే రోడ్లు వేయడం కాదని, కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమని వెల్లడించారు. ముఖ్యమంత్రి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లక్షల రూపాయల లబ్ధి చేకూర్చారని చెప్పారు. 35 ఏళ్ల ఎమ్మెల్యేగా, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కుప్పం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. మరోమారు చంద్రబాబు మోసపు మాటలను నమ్మవద్దని కోరారు. 95శాతం హంద్రీనీవా పనులను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పూర్తి చేస్తే, 5శాతం పనులను చంద్రబాబు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, ఇప్పుడు మళ్లీ హామీలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్నారన్నారు. కుల, మత రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని తెలిపారు. నిత్యం మీ మధ్యలోనే ఉండే ఎమ్మెల్సీ భరత్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ, మున్సిపల్ చైర్మన్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నాయకులు నరేష్‌కుమార్ రెడ్డి, మొగసాల రెడ్డెప్ప, మొగసాల కృష్ణమూర్తి, మురుగేష్, కుట్టి, రమేష్, షౌకత్, నారాయణప్రసాద్, గిరిప్రసాద్, సురేష్, గణపతి పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : పది, ఇంటర్ ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వీ.శేఖర్ తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 25వ తేదీలోపు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా, అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 5వ తేదీలోపు రూ.200 అపరాధ రుసుముతో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి ఫలితాలను 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపీఈఎస్ఎస్‌సీహెచ్‌ఓఓఎల్.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పాసైన విద్యార్థుల సర్టిఫికెట్లు డిజిలాకర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి వివరాలను ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ, తిరుపతి డీఈఓ కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు.

అసామాన్యంగా సుపరిపాలన




సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

నగరి : సంక్షేమ పథకాలను అసామాన్యంగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. మంగళవారం మండలంలోని అడవికొత్తూరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 733 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా మహిళలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా ముఖం చేటేసిన టీడీపీ నేతలు ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో తగుదునమ్మా అంటూ వస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తుత్తి మాటలు చెప్పేది కాదని, చేతల్లోనే చూపిస్తుందని స్పష్టం చేశారు. అందులో భాగంగా ఒక్క అడవికొత్తూరు సచివాలయ పరిధిలోనే రూ.40 లక్షల వ్యయంతో సచివాలయం, రూ.21.80 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రం భవనాలు నిర్మించామని, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో రోడ్లు, కల్వర్టులు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పేదల గృహ నిర్మాణాల కోసం రూ. 77.4 లక్షలు, నాడు–నేడు పథకంలో రూ.80 లక్షలు, జలజీవన్ మిషన్ పథకంలో రూ. 77.5 లక్షలు, మురుగుకాలువల నిర్మాణానికి రూ. 20 లక్షలు వెచ్చించినట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.8.57 కోట్లు మొత్తం రూ. 12 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి వాసు, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ లీలా మాధవి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప పాల్గొన్నారు.

సముద్రంలో వేటకు వెళ్లొద్దు



రఘుబాబు, మత్స్యశాఖాధికారి



తీగపాళెం తీరం వద్ద ఎగసిపడుతున్న కెరటాలు

చిల్లకూరు: బంగాళాఖాతంలోని వాయువ్య దిశగా ఏర్పడిన అల్పపీడనం దృష్ట్యా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని చిల్లకూరు ఎఫ్‌డీఓ రఘుబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ బంగాళఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ఉధృతమై వాయుగుండంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో సముద్రంలో అలల తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. అలాగే తీరంలో ఈదురు గాలులు వీచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకుని చేపల వేటను రద్దు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చిల్లకూరు, తీర ప్రాంతంలోని ప్రజలు, అలాగే సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాలకు చెందిన మత్స్యకారులు చేపల వేటకు మూడు రోజుల పాటు వెళ్లొద్దన్నారు. ఇప్పటికే ఎవరైనా సముద్రంలోకి వేటకు వెళ్లి ఉంటే వెంటనే వారిని ఒడ్డుకు వచ్చేలా వారి కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. తీర ప్రాంతాలలోని సచివాలయాల్లో పనిచేసే మత్స్యకార సహాయకులు అప్రమత్తంగా ఉండి మత్స్యకారులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ క్షేత్రస్థాయిలోని పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.

క్లుప్తంగా

అనుపల్లి సుధాకరయ్యకు రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ అవార్డు



సుధాకరయ్య అవార్డును పరిశీలిస్తున్న వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో గణితశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ అనుపల్లి సధాకరయ్యకు ఐఎస్ఎస్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్కాలర్స్) అనే అంతర్జాతీయ సంస్థ లైఫ్ టైమ్ మెంబర్ షిప్, రీసెర్చ్ ఎక్స్‌లెన్స్ అవార్డును ప్రదానం చేసింది. మంగళవారం యూనివర్సిటీలో ఆయన వీసీ రాజారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ ఆయనను అభినందించారు. శాస్త్రవేత్త జార్జ్ క్యాంటర్‌ను ఆదర్శంగా తీసుకుని 'ఎక్స్ పవర్ సెట్' అనే సూత్రాన్ని కనుగొన్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు గణితశాస్త్రంలో 107 అంశాలపై పరిశోధనలు పూర్తిచేసి పదుల సంఖ్యలో ఎంఫిల్, పీహెచ్‌డీలు చేశానని తెలిపారు. తోటి అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

సుబ్రమణ్యస్వామి విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళాలను అందజేస్తున్న దాతలు

పాకాల: స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో 54 అడుగుల సుబ్రమణ్యస్వామి భారీ విగ్రహ ఏర్పాటుకు దాతలు పదిపుట్లబైలు శోభన్ బాబు రూ.51,000, వైఎస్సార్‌సీపీ టౌన్ ప్రెసిడెంట్ రమేష్ రూ.51,000 ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డికి అందజేశారు. మంగళవారం వారికి స్వామివారి దర్శనం కల్పించారు.

చంద్రబాబు పాలనను కోరుకోవట్లేదు

- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మరు
- గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: చంద్రబాబు 14 ఏళ్ల పాటు పాలించిన దుర్మార్గపు పాలనను తిరిగి ప్రజలు కోరుకోవట్లేదని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి 7వ డివిజన్‌లో మంగళవారం గడప గడప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.


అనంతరం మీడియాతో మాట్లాడుతూ 45 ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ, 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిని అని చెప్పుకునే చంద్రబాబు ఏనాడైనా ప్రజలకు చిన్నపాటి మేలు చేశాడా? అని ప్రశ్నించారు. ధనవంతులకు కొమ్ము కాయడం తప్ప పేదల సంక్షేమం కోసం ఆలోచించి ఒక్క సంక్షేమ పథకాన్నైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో వంద పేజీల మేనిఫెస్టో ఇచ్చిన చంద్రబాబు అందులో ఏ ఒక్కటైనా నెరవేర్చారా? అని ధ్వజమెత్తారు. కేవలం అధికార దాహంతో ఎన్నికల సమయంలో నోటికి వచ్చినట్లు అబద్ధపు హామీలు ఇవ్వడం.. అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబు నైజమన్నారు. చంద్రబాబు మోసాలను గమనించిన రాష్ట్ర ప్రజలు 2019 ఎన్నికల్లో డిపాజిట్ కూడా లేకుండా చేసి మూలనకూర్చోపెట్టినా ఇంకా బుద్ధిరాలేదన్నారు. మళ్లీ ప్రజలను మభ్యపెట్టి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చేందుకు విఫ్రప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకు తోడు పవన్‌కళ్యాణ్ చేరి ప్రభుత్వంపై బురదజల్లేందుకు నోటికి వచ్చిన విమర్శలు చేస్తున్నారన్నారు. నిత్యం ప్రజాసంక్షేమం కోసం శ్రమిస్తున్న జగనన్నపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని స్పష్టం చేశారు. జగనన్న పేదప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

'అపూర్వ' కలయిక



డాక్టర్ రాధా గిరిధర్ దంపతులను సత్కరిస్తున్న 1964 బ్యాచ్ వైద్యులు

తిరుపతి తుడా: తిరుపతి శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాలకు వైద్యరంగంలో ఓ ప్రత్యేక స్థానం ఉంది. 1964లో ఎస్వీ మెడికల్ కళాశాల మొదటి బ్యాచ్‌తో వైద్య విద్య ప్రారంభమైంది. ఈ క్రమంలో మంగళవారం ఎస్వీ మెడికల్ కళాశాల 64 వ్యవస్థాపక దినోత్సవాన్ని భువన విజయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల మొదటి బ్యాచ్ వైద్య విద్యార్థులు సుమారు 30 మంది కలిశారు. వారు నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. వైద్య విద్యను అభ్యసించి అమెరికాలో స్థిరపడ్డ ప్రముఖ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రాధా గిరిధర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో వైద్య విద్యను అభ్యసించడం సంతోషంగా ఉందన్నారు. దాదాపు కోర్సు పూర్తి చేసి 54 ఏళ్ల తర్వాత తిరిగి మళ్లీ నాటి విద్యార్థులను కలుసుకోవడం ఎంతో అనుభూతి కలిగించిందన్నారు ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కలవడం ఆనందంగా ఉందని, వారి మాటలు నేటి వైద్య విద్యార్థులకు స్ఫూర్తినిచ్చాయన్నారు. వైద్య పరిశోధనలు చేస్తున్న 13 మంది వైద్య విద్యార్థులకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్‌షిప్ రూ.10,000 చొప్పున మొత్తం రూ1.3 లక్షల చెక్కును అందజేసినట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ ప్రేమానంద్, డాక్టర్ హరినాథ్, డాక్టర్ బాలకృష్ణశెట్టి, డాక్టర్ రాఘవరెడ్డి, డాక్టర్ భారతి, రుయా, ప్రభుత్వ ప్రసూతి సూపరింటెండెంట్లు డాక్టర్ రవిప్రభు, డాక్టర్ పార్థసారథిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధర దేవి, డాక్టర్ వెంకట్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రపంచంలో మనుషులు పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని పెద్దలు చెబుతుంటారు. ఈ కోవలోనే ఇద్దరూ.. ఇద్దరే అన్నట్టు కవల పిల్లలు ఉండడాన్ని అందరూ గమనిస్తుంటారు. కానీ కొండను పోలిన కొండలు ఉండడం ఇప్పుడే చూస్తున్నాం. తిరుమల శేషాచల కొండలు మాదిరే వెంకటగిరి వద్ద ఉన్న కొండలూ ఉన్నాయి. వీటిని చూసిన వారు సేమ్ టూ సేమ్ అని చెబుతున్నారు.. ఇదంతా ఆ కలియుగ వెంకన్న మహిమే అని భక్తులు, ప్రకృతి ప్రేమికులు చర్చించుకుంటున్నారు. ఈ దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

-ఫొటోలు : - ఎస్‌కే.మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

పులికాట్‌లో పూడిక తీత ప్రక్రియ

వేగవంతం చేయండి



కేంద్ర మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : పులికాట్ సరస్సు ముఖద్వారం వద్ద పూడికతీత ప్రక్రియను వేగవంతం చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ భూషణ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. పులికాట్ ముఖద్వారం ఇసుక మేటలు వేసి పూడిపోవడంతో ఎండా కాలం సరస్సులో నీటి మట్టం తగ్గి చేపల వేట లేక మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పులికాట్ ముఖద్వారం పూడిక తీతకు సహకరించాలని పార్లమెంట్లో పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. కేంద్రం ప్రభుత్వ ప్రతిపాదిత అంచనా మొత్తం రూ.128.80 కోట్లు వెచ్చించనున్నట్టు తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు సహకరించాలని ఎంపీ అభ్యర్థించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్యలేంటి?

ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటని ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. మంగళవారం ఆయన ఢిల్లీలోని పార్లమెంట్‌లో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. ఫుడ్ ప్రాసెసింగ్ సౌకర్యాల కొరత కారణంగా రైతులు పండించిన ఉత్పత్తులను విక్రయించుకోలేక రైతులు తమ ఉత్పత్తులపై లాభాలను కోల్పోతారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 2 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పండ్ల తోటలు ఉన్నాయని, ఈ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపిస్తే పండ్లు, కూరగాయల డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. దీనిపై కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్ సింగ్‌పటేల్ సమాధానమిస్తూ ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన ద్వారా సంబంధిత మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపన, విస్తరణ కోసం పారిశ్రామికవేత్తలకు గ్రాంట్స్-ఇన్-ఎయిడ్ రూపంలో క్రెడిట్ లింక్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ (క్యాపిటల్ సబ్సిడీ) అందిస్తోందన్నారు. ఈ పథకం కింద పండ్లు, కూరగాయలతో సహా మొత్తం 11 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పనున్నట్టు పేర్కొన్నారు. 2021-22 నుంచి 2026-27 వరకు ఆరేళ్ల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రాజెక్టులలో మొత్తం రూ.1387.03 కోట్ల పెట్టుబడి పెట్టుబడి పెట్టినట్టు వివరించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సినీ నటి రమ్యకృష్ణ , ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు , ఎమ్మెల్సీ కళ్యాణి, యాంకర్ బిత్తిరి సత్తి , ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం సినీ నటి రమ్యకృష్ణ, ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ కళ్యాణి, యాంకర్ బిత్తిరి సత్తి, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా సత్కరించారు.

రచయిత రొడ్డకు ఉత్తమ రచనా కీర్తి పురస్కారం



రచయిత రొడ్డ సురేంద్ర

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రొడ్డ సురేంద్రకు ఉత్తమ రచనా కీర్తి పురస్కారం లభించింది. ఈమేరకు ఆగస్టు 1వ తేదీన హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో నిర్వహించే ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ 21వ వార్షికోత్సవంలో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఆలూరి విల్సన్, కార్యదర్శి ఎస్.ఇందిర తెలిపారు. ఈ మేరకు రొడ్డ సురేంద్రను పలువురు ఉపాధ్యాయులు, సాహితీ వేత్తలు అభినందించారు.

కారు టైరు పేలి..

- రెండు కార్లు ఢీ
- ఇద్దరు భక్తులకు స్వల్పగాయాలు



ప్రమాదంలో ఢీకొన్న కార్లు

తిరుమల : ప్రమాదవశాత్తు ఓ కారు టైరు పేలడంతో మరో కారును ఢీకొన్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. తిరుమల ట్రాఫిక్ పోలీసుల కథనం .. తిరుపతికి చెందిన రెండు ట్యాక్సీల్లో భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు రెండో ఘాట్ రోడ్డులో బయలుదేరారు. వాహనాలు ఘాట్ రోడ్లో వెళుతున్న సమయంలో అకస్మాత్తుగా ఓ కారు టైరు పేలి అదుపుతప్పి పక్కనే వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన ఇద్దరు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. టీటీడీ ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కార్లను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడిన వారిని టీటీడీ అశ్విని ఆస్పత్రికి తరలించారు.

అర్హతే ప్రామాణికం

- జగనన్న సురక్షతో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- లబ్ధిదారులకు 2,799 సర్టిఫికెట్ల అందజేత




చంద్రగిరి మండలం, చిన్నరామాపురంలో ధ్రువపత్రాన్ని అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ఇంటికే ప్రభుత్వ సేవలందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శ సీఎంగా దేశం మొత్తం కీర్తిస్తోందని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు నింపారని తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చంద్రగిరి మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతి రూరల్ మండలం, లింగేశ్వరనగర్ పంచాయతీలో 851, రామచంద్రాపురం మండలం, అనుప్పల్లిలో 670, చంద్రగిరి మండలం , దోర్నకంబాలలో 550, చిన్నరామపురంలో 728 మొత్తం 2,799 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయా పంచాయతీలలో ప్రజలు పలు వినతులను విన్నవించారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పాలనలో చంద్రగిరి నియోజకవర్గంలో గ్రామాలు శాశ్వత అభివృద్ధికి చిరునామాలుగా చరిత్రలో నిలిచాయని తెలిపారు. జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసిన సందర్భాలు లేవన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరినీ తన కుటుంబ సభ్యుల్లా భావించి వారికి అండగా నిలుస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి బాటలో తానుకూడా ప్రజాసేవకు అంకితమవుతానని, 2024 ఎన్నికల్లో ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.





శేషాచలం..పచ్చని శిలాతోరణం!



శేషాచలం అడవులు పచ్చని తివాచీ పరుచుకుని కనువిందు చేస్తున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న తుంపర వర్షాలకు పురివిప్పుకుని పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తుల మనసుకు ఆహ్లాదానిస్తూ ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నాయి. వాహనాల్లో వెళ్లేవారి చూపు తిప్పుకోనీయకుండా కట్టిపడేస్తున్నాయి. దట్టంగా కప్పేస్తున్న కరిమబ్బుల మధ్య తిరుమల అందాలు మరింత మెరిసిపోతున్నాయి. మూడు నామాలవాడిని స్మరిస్తూ.. తెలిమంచు తెరలు చీల్చుకుంటూ.. శేషాచలాన్ని అధిరోహిస్తూ.. భక్తులు పరవశించిపోతున్నారు. - తిరుమల

